# కంప్యూటర్ 'కల'

ఆ టౌన్ ఒకప్పుడు బాగ వెనకపడ్డదే. ఆ మధ్య సాగర్ కాలువ రావటం వల్లా అక్కడి భూముల ధరలు బాగా పెరిగిపోయినయి. టౌనూ పెరిగింది. చుట్టూర వున్న చెలుకలన్నీ ప్లాట్స్‌గ మారినట్టు పెరిగె ఇళ్ళను, నాటిన రాళ్ళను చూస్తెనె తెలిసిపోతుంది. అందువల్లా చాల మంది కొత్త ధనవంతుల వరుసలో చేరిపోతున్నారు. వాళ్లల్లో రమేష్‌చంద్ర ఒకరు. రమేష్‌చంద్ర స్టీల్, సిమెంటు వ్యాపారం. అదనంగా భూములను కొని అమ్ముతువుంటాడు. అందువల్లా కొద్ది కాలంలోనే బాగ సంపాదించాడు. ఓ బంగళా కట్టించుకున్నాడు. ఆధునిక వస్తువులతో ఇల్లును అలంకరించాడు. ఒక్క కొడుకు, ఒక్క కూతురు చక్కని సంసారం, పిల్లవాడు యస్సెస్సీ. అమ్మాయి ఏడవ తరగతి అదే టౌన్‌లోనే మంచి స్కూల్లో చదువుతున్నారు.

ఒకరోజు ఫోన్ మోగింది. రిసీవర్ ఎత్తి -

"హల్లో రమేష్‌చంద్ర" చెప్పండి

"నేనోయ్ రాజును హైద్రాబాదు ఎప్పుడొస్తున్నావు"

"ఎప్పుడంటె అప్పుడే"

"సాయంత్రం వరకు రాగలవా? ఇంట్లోనే వుంటాను, రా"

రమేష్ రిసీవర్ పెట్టేసి, "ఓయ్ మధ్యాహ్నం హైద్రాబాదు వెళ్లాలి బ్రీఫ్‌కేసు సర్దు" అన్నాడు భార్య సుశీలతో

"అనుకోని ప్రయాణం" అంటు భర్త దగ్గర్కి వచ్చి నిలుచుంది.

"అదె మీ అన్న రాజు, రమ్మని ఫోన్ చేశాడు" అంటూ డ్రస్సింగ్ టేబుల్ వైపు నడిచాడు.

0 0 0

ఆటో, రాజు ఇంటిముందాగింది. ఆటో చప్పుడు విన్న రాజు గేటు తెరచి నిలుచున్నాడు.

"సరళ, ఇటుచూడు ఎవరొచ్చారో" అంటూ భార్యను పిలిచాడు రాజు

"నమస్కారం అన్నయ్య, ఇప్పుడేనా రావటం" అని అడిగింది.

"అవునమ్మా" బ్రీఫ్‌కేస్ రాజుకిస్తూ, బాత్‌రూమ్‌వైపు నడిచాడు. బయటికి రాగానే తువాలందించాడు రాజు.

ఫ్రెష్ అయి సోఫాలో కూర్చోగానే, సరళ కాఫీ ట్రేతో వచ్చింది.

ముగ్గురు కాఫీ తాగుతువున్నారు.

"అన్నయ్య వదిన పిల్లలు అందరు బాగేకదా?" అని అడిగింది.

"ఓ అంతా బాగానేవున్నారు" ఈలోపు రాజు బట్టలు మార్చుకుని తయారు అయ్యాడు. శాండల్ వుడ్ ఆయిల్‌ను తాను అద్దుకొని చంద్రకూ అద్దాడు.

"సరళ ఈరోజు ఓ పార్టీ వుంది. మేం వెలుతున్నాం. డిన్నర్ కూడ అక్కడే" అంటూ కారు తీసి స్టార్ట్ చేశాడు.

అది నిజాం క్లబ్ వైపు పరుగెత్తింది. లైట్లు వెలుగుతున్నాయి రాత్రి ఏడైంది. కారు పార్కుచేసి, ఓపెన్ ఏరియాలోని ఓ టేబుల్ ముందు కూర్చున్నారు. సన్నని క్లారనెట్ మ్యూజిక్ వస్తువుంది. కాస్త దూరంలో ఓ మగ ఇద్దరు ఆడవాళ్ళు వైన్ ఎంజాయ్ చేస్తున్నారు. బేరర్‌కు అర్డర్ ఇవ్వాల్సిన డ్రింక్స్ ఆర్డరిచ్చాడు రాజు. మిగతావాటికి తర్వాత రమ్మన్నాడు.

"అట్లాగే" అంటూ బేరర్ కదిలాడు.

ఎదురుగావున్న టీవిలో ఏదో ఆధునికమైన డాన్స్ వస్తూవుంటే చూస్తువున్నారు. డ్రింక్ వొచ్చింది. గ్లాసులు కదిలాయి. బేరర్ ఐస్‌ట్యూబ్స్ వేసి సోడా పోసి ఇచ్చిపోయాడు. ఈసారి ఫుడ్ ఆర్డరిచ్చాడు. పదియేను నిమిషాల తరువాత చిల్లిచికెన్ వొచ్చింది. అరగంట తరువాత జింజేర్ ప్రాన్స్ వొచ్చింది. ముచ్చట్లు నడుస్తూనేవున్నాయి. మొదట వ్యాపారం ఆతరువాత రాజకీయాలు చివర్న కాల్‌గర్ల్స్ గూర్చి అలోచనలను కలబోసుకుని డ్రింక్ పూర్తిచేసి, బిర్యాని ఆర్డర్ ఇచ్చారు.

"అవును సందీప్ ఏ క్లాసు" ని అడిగాడు రాజు

"టెన్త్"

"జాబిలి" సెవెన్త్.

"ఇద్దరిని ఆవూళ్లో వుంచకు. సందీప్‌ను మంచి రెసిడెన్షియల్ కాలేజిలో జాయిన్‌చేయి. ఇంటర్‌చాలా ఇంపార్టెంట్. విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పేది సుమా" అన్నాడు రాజు

"నేనూ ఆలోచిస్తునేవున్నా. నీవుకూడ చూడు. మనం సంపాదించేది పిల్లలకోసమేకదా. వాళ్లు బాగ చదువుకుని వృద్ధిలో కొస్తేచాలు"

"ఆట్ల రావాలంటే వాళ్లను మంచి స్కూల్‌లో చదివించాలి. తాలూకాలలో మంచి స్కూల్లెక్కడుంటాయి. ఇంగ్లీష్‌మీడియంమే కదా" అన్నాడు రాజు విస్కి చప్పరిస్తు.

ఈలోపు రాజు సెల్ మోగగానే చెవిదగ్గర వుంచాడు. "హల్లో రాజు ఎక్కడరా నేను ఇంటికిఫోన్ చేస్తే బయటికివెళ్లావు అని చెప్పారు. ఎక్కడున్నావు"

అవతల కంఠం.

"నిజాం క్లబ్‌లో"

ఈ రోజుల్లో ఇంకా నిజాంక్లబ్బేమిటిరా నా బొంద. కంట్రీ క్లబ్‌మెంబర్‌షిప్ తీసుకోగూడదు నేనక్కడినుండి మాట్లాడుతున్నా మార్పు వల్ల థ్రిల్ వుంటదిరా" అన్నాడు.

సెల్‌ను ఆపుచేశాడు.

"ఎవరు" అని చంద్ర అడిగాడు.

ఓ ఫ్రెండ్‌లే వాడు కంట్రీ క్లబ్‌లో మెంబర్. నన్నుకూడ చేరమంటున్నాడు. ఓ పనిచేయగూడదు నీవు అందులో మెంబర్‌షిప్ తీసుకుంటే బాగుండదు? మనం చాయిస్‌నుబట్టి దేనికంటె దాని కెళ్లచ్చు అన్నాడు రాజు.

"సరె" అన్నాడు చంద్ర.

డబ్బు సంపాదించడమే కాదోయి ఎంజాయ్ చేయడం కూడ తెలుసుకోవాలి. పదిమందితో పరిచయాలు మనకు ఉపయోగపడుతాయి. బేరర్ తెచ్చిన బిల్‌ను నేనంటే నేను చెల్లిస్తానని కాసేపు అన్న తరువాత" ఓయ్. ఇది హైద్రాబాదు నేను ఇక్కడేవుంటున్నా. నేను చెల్లించడమే మర్యాద" అంటూ రాజు పచ్చ నోట్లు ట్రేలో వుంచాడు. కొంత చిల్లరను వదిలి ఇద్దరు లేచి బయటికి నడిచి కార్లో కూర్చొన్నారు. కారు ఇంటివైపు పరుగెత్తింది.

0 0 0

పరీక్షలు జరిగే రోజులు.

అప్పటివరకు చదువుకున్న సందీప్, జాబిలి నిద్రలోకి వెళ్లారు. చంద్ర ఆయన భార్య మధ్యహాల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. మాటల్లో పిల్లల చదువు విషయంవొచ్చింది. రాజు పిల్లలను సిటీలో చదివించమంటుండు అని చెప్పాడు. అదివిన్న సుశీల "బాగానే వుంటుంది కానీ వ్యాపారం ఎప్పుడు ఇట్లా సాగుతుందని ఎం నమ్మకం. సిటిలో చదవంటే ఓ ఇల్లు కావాలి. పిల్లలకోసం నేను అక్కడే వుండాలి. నేనొకచోట మిరొకచోట ఎం బాగుటుంది" అన్నది.

"అట్లా ఎంకాదు. పిల్లలను రెసిడెన్షియల్ కాలేజిలలో చేర్చుదాం. మనకు ఏ బాధలుండవు" అన్నాడు.

"అదిసరె అయ్యే ఖర్చులు"

"ఇది కంప్యూటర్ యుగం. మంచికాలేజీలలో చదివిస్తే మంచి మార్కులు సంపాదిస్తారు. బాగ మార్కులు సంపాదిస్తే క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎన్నిక

అవుతారు. లేదా బయటికి పంపొచ్చు, అమెరికాలో మంచి డిమాండ్ వుంది."

"ఆలోచించండి నేనైతే తెచ్చేదాన్ని కాదు ఇచ్చే దాన్ని కాదు మీ ఇష్టం"

అవును అనసూయ వాళ్లకొడుకు అమెరికాలోనే కద వుండేది. ఐదేండ్లు అయ్యిందోలేదో ఇరువై లక్షలు పంపాడట. హైద్రాబాదులో ఓ పెద్ద ఇల్లు కొన్నారట" 'ఏ మూలననో తన కొడుకూ వెళితే బాగుంటుందని అనుకుంటూనే' అంది సుశీల ఆశ్చర్యంగా చూస్తూ.

"అందుకే మొదటినుండి మంచి కాలేజీలో చదివిస్తే బాగుంటది. అనుకున్న కోరిక నెరవేరుతది".

సందీప్ యసెస్సిలో ఫస్ట్‌క్లాస్ వొచ్చాడు.

రాజుకు ఫోన్‌కలిపి రిసీవర్ ఎత్తాడు.

"హల్లో రాజా"

"ఆ చెప్పవోయ్"

"సందీప్ ఫస్ట్ క్లాసులో పాసైయ్యాడు"

"కంగ్రాట్స్ చెప్పువానికి. ఇక ముందు ఇంటర్ కూడ ఫస్ట్ క్లాస్‌వొస్తే, నీ పంట పండిందనుకో"

"వస్తాడు వాడు చాల తెలివైనవాడు" అంటూ కొడుకు తెలివిని ఓసారి గుర్తిచేసుకున్నాడు. వాడు సెవెన్త్ వరకు 'ఎ' గ్రేడు ఆ తరువాత గూడ మంచి మార్కులే ఎప్పుడు ఫస్ట్ సెకండ్ ర్యాంకులే. ఓసారి థర్డ్ ర్యాంకు వొస్తే ఓపూట అన్నంగూడ తినలే! చదువు మీద శ్రద్ధ ఉన్నవాడు కాబట్టె అంత ఇదిగా ఫీలై పోయాడు.

"యస్సెస్సీలో చాలమంది ఫస్ట్‌క్లాసే వస్తారులే, ఆబ్జెక్టివ్ పేపరుంటది కనుక ఎక్కువ మార్కులొస్తాయి" అన్నాడు రాజు తేలికగా తీసుకుంటూ

"కాని వాడు అట్లాకాదు క్లవర్ స్టూడెంట్" అన్నాడు.

"ఇక్కడో రెసిడెన్షియల్ కాలేజి వుంది. రిజల్ట్స్ సెంటు పర్సెంట్, క్లాసు రాకపోతే ఫీ వాపస్ అట అందులో చేర్పిద్దాం" అన్నాడు.

"నీవు ఇక్కడికొచ్చినాక మాట్లాడుదాం రా"

"ఇంకా మెమోలు రాలేదు వచ్చినాక వస్తాను" అంటూ ఫోను పెట్టేశాడు.

"ఖర్చు ఎక్కువ రావొచ్చు" అంతవరకు పక్కన్నె నిల్చోని అంతా విన్న సుశీల అంది.

"నాకొదిలేయి నేను చూసుకుంటా, ఈ రోజు పెడితే రేపు రావా? అప్పు చేసి అయినా చదివించాలి" అని బయటకు నడిచాడు.

అనుకున్నట్టు హైద్రాబాదులోనే చేర్చాడు. సందీప్ సిటిలో చదువు బాగానే వుంటుందని సంతోషించాడు. సందీప్ వెనకటికంటే ఊశారుగానేవున్నాడు. కాని రెసిడెన్షియల్ కాలేజి కనుక కట్టేసినట్లు వుందన్న ఫీలింగ్‌వుందని అతని ముఖంచెపుతువుంది. స్నేహితులు మారారు. అలవాట్లు మారుతున్నాయి. కాలేజి ఫీజులు, హాస్టల్ చార్జీలు, పాకెట్‌మనికూడ పెరిగింది. మొత్తంమీద మొదటి సంవత్సరం గడిచింది. ఫస్టియర్ మంచి మార్కులతోనే పాసైయ్యాడు. తండ్రి సంతోషించాడు కాని మార్కులు మాత్రం రావల్సినన్ని రాలేదు.

రెండవ సవత్సరం మొదలైంది. బట్టల విషయంలో తండ్రిని అడిగి మరీ మంచివి కొనిపిచ్చుకున్నాడు. వాటికి తగిన షూ కొనిపిచ్చుకున్నాడు. టీషర్ట్స్, మంచిరకపు బెల్ట్స్, తండ్రి దేనిని కాదనలేదు. సందీప్‌లో సగం మార్పు వచ్చింది. కాస్త వల్లుచేసాడు. షాపింగ్ పేరుతో బయటికి వెళ్లినప్పుడు సినిమాలు చూడడం, రెస్టారెంట్‌లో తినడం సందీప్‌కు అతని స్నేహితులకు మామూలై పోయింది. అట్లా రెండవసంవత్సరము పూర్తిచేసాడు. కానీ ఈసారి క్లాసు రాలేదు, మంచి మార్కులు రాలేదు.

అదితెలిసిన తండ్రి ఉగ్రుడైనాడు. "వాన్నేమనకుండి ఈరోజుల్లో పిల్లలు మాట పడడంలేదు. ఏమన్న చేసుకుంటే జీవితాంతం ఏడ్చి చావాలి". అంది ఆతురుతగా సుశీల.

పొంగుతున్న పాలపై నీళ్ళు చల్లితే చప్పున తగ్గినట్లు తగ్గాడు. చంద్ర అవును అదీనిజమె అనుకున్నాడు. ఎక్కడకోపం మొచ్చి వాన్ని తిడతానో అని ఆ తరువాత తాను హైద్రాబాదుకు వెళ్లలేదు, రాజుకు ఫోన్‌చేసి "వాన్ని ఎంసెట్ ఎంట్రెన్స్‌కు ప్రిపేర్‌కమ్మను. ఎక్కడన్నా కోచింగ్ సెంటెర్‌లో చేర్పించు. ఇక ఆ కాలేజీలో వద్దు. అక్కడి దోస్తులవల్లనే వాడు అట్లా తయారయ్యాడు. ఫీ ఎంతో నీవు చెల్లించి నాకు ఫోన్‌చేయి. పంపిస్తాను" అన్నాడు. ఒళ్లంతా చెమటలు పోసి, ఎద ఎగురుతు వుంటే అణచుకున్నాడు.

"సరె, గాని నీవు చాలసీరియస్‌గా తీసుకుంటున్నవే. ఇది మామూలే. ఇది ఇంటింటిరామాయణం నీవు అతిగా ఆలోచించకు" మాటను మార్పించే ప్రయత్నంచేశాడు. రాజు

"ఒక్కగానొక్క వెదవ, వాన్నే బాగ చదివించాలి అనుకుంటూవుంటే వాడేమో పట్టించుకోవడంలేదు. చదువంటే సరదా అనుకుంటువున్నాడు. వాన్నీ ఓసారి క్లాసుతీసుకో" అంటూ ఫోను పెట్టెశాడు.

సుశీల మంచినీళ్లగ్లాసు అందించింది చంద్రకు.

చంద్రకు తాను చదువుకునే రోజులు గుర్తోచ్చాయి. సర్కారు స్కూల్స్ వాళ్లు చెప్పిందే చధువు, ఆరోజు టెక్ట్స్ పుస్తకాలు ఉండేవికావు. ఇప్పుడు అన్నీ పుస్తకాలు, వాటితోపాటు గైడ్స్ వగైరా, కావల్సింది శ్రద్ధగా చదవటమే. తిండి దొరకని పిల్లలు కేవలం బడిలో మాత్రమే చదివి, మంచిమార్కులు తెచ్చుకుని ఐఐటిలలో చదివి అమెరికా పోయినోళ్లు ఉన్నారు. ఇది కంప్యూటర్‌కాలం. కంప్యూటర్ రాకపోతే చధువురాని వానితో సమానమట. సుశీల శ్రమ శ్రద్ధ చాల అవసరమం. ప్రభుత్వం కంప్యూటర్ అదే 'సైబర్‌సిటి' ఓ పట్టణాన్నె నిర్మించారు. ఎందరో దేశవిదేశీయులు వచ్చి పోతువున్నారు. సలహాలు ఇచ్చిపోతువున్నారు. బిల్‌గేట్స్ విషయం పేపర్లో చదివాంగ. అంటే ఒక్క మనిషి ఎంత సాదించాడు చూడు తెలివిని పెంచుకుంటే ఎవరైన ఎంతైనా ఎదగగలరు. చేయవలసిందల్లా చదవడమే బాగ చదువుకున్నవాడు ఏదైనా సాధిస్తాడు. ముఖ్యంగా కంప్యూటర్ కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో మన ప్రభుత్వం సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది. ఇక ఉద్యోగాలకు కొదవ వుండదు. రాబోవుకాలంలో మంచి భవిషత్‌వుందని మీడియా వర్సెన్

చంద్ర హైద్రాబాదు వెళ్ళటం తగ్గించాడు. వెళ్లినా కొడుకు చదివె కాలేజికి వెళ్లటంలేదు. ఈలోపు ఎమ్‌సెట్ ఎంట్రెన్స్ పరీక్షలు వొచ్చినయి. సందీప్‌తో సహా ఎందరో రాసారు. తరువాత రెండు నెలలు గడిచాయి. రిజల్ట్స్ వచ్చాయి. సందీప్‌కు మంచి ర్యాంకు రాలేదు. చంద్రనెత్తి పీక్కున్నాడు. ఆరోజు మరింత తాగాడు. సుశీల ఎప్పటికప్పుడు సర్దిచెపుతూనేవుంది.

"పోనీయండి అందరు కంప్యూటర్ ఇంజనీర్లు అవుతున్నారా? మనదగ్గరేవున్న బియస్సీచదివించండి. అంటే వినసే వినరైతిరి. సరే అయిందేదో అయింది పోనీయండి వానికి శ్రద్ధ లేనపుడు మనం ఏం చేస్తాం." అంది సుశీల.

"ఏదో పనిచేసుకోని బతుకుతడు దునియాలో అందరూ అది చదివే ఉద్యోగాలు చేస్తున్నారా?" అంది మళ్ళీ తానె.

"నీ ముఖం చాలమంచి సలహా ఇచ్చావు. మంది పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతుంటే నీ కొడుకేమే ఏదో ఓ పని చేసుకొని బతుకుతాడు. అబ్బా నీ కోరిక పాడుగాను ఎంత మంచి కోరిక" అన్నాడు వెటకారంగా పండ్లు కొరుకుతూ.

"మరేం చేస్తం బుద్ధి వానికుండాలెకాని మనంచేసేది ఏముంది. కావల్సిన ఖర్చు ఇస్తాం అంతకంటే ఎక్కువ ఏం చేస్తాం చదివించడం మన వంతు, చదవడం వాని వంతు" అంది సుశీల.

“ఇక చాలు నీ సలహాలు. వాన్ని కంప్యూటర్ ఇంజనీరుగా చేసితీరుతా. డోనేషన్ కట్టి కర్నాటకలోనైన చదివిస్త. అందుకని 'కె సెట్' రాయమని గూడ చెప్పాను” అన్నాడు చంద్ర తీవ్రంగా స్పందిస్తూ.

కొన్ని రోజులు అదో మాదిరిగ మౌనంగా తండ్రిని తప్పించుకుంటూ తిరుగుతున్నాడు సందీప్.

చంద్ర సంపాదించిన ప్లాట్లను ఒక్కొక్కటె అమ్మేసాడు. సుశీలను నొరెత్తనీయలేదు. అనుకున్నట్టే పదిలక్షల డొనేషన్ ఇచ్చి కర్ణాటకలోని దావణరే లోని ఓ ప్రయివేటు కాలేజిలో చేర్పించాడు. ఓ నలుగురు నాలుగు స్టేట్స్‌కు చెందినవాళ్ళు, ఓ అద్దే యింట్లో వుండేటట్లు వాళ్ళకు ఓ పనిమనిషిని కూడా ఏర్పాటు చేశాడు.

వేరే వేరే పిల్లలు రూమ్‌కువస్తూ పోతువుండేవారు. ఒక్కొక్కరు తమతమ అలవాటును ఆ రూమ్‌లో వదిలిపోతువుండేది. మొదట పనిమనిషికి బీరు బాటిల్స్ మూతలు ఆ రూమ్ మూలన కనిపించాయి. ఆ తరువాత రెండవ సంవత్సరం సోడాసీసాల మూతలు కనిపించాయి. అంతేకాదు సిగరేట్ పీకలు కనిపించేసరికి పనిమనిషికి వీళ్ల తతంగమంత తెల్సిపోయింది.

తల్లి–దండ్రి పంపించే డబ్బు ఇట్లా తగిలెయ్యడం ఏంబాగ లేదనిపించేది. మూడవ సంవత్సరం వచ్చే సరికి అన్నీ చెడు అలవాట్లను వాళ్ళలో చూసింది. అట్లా అట్లా ఓ నాలుగు సం॥లు గడిచిపోయి, ఫైనల్ ఎగ్జామ్స్ అయిపోయినయి ఫలితాలు కూడ ప్రకటించారు.

సందీప్ నంబరు రాలేదు. ఆ రోజు ఆయనకు కాస్త జ్వరం కూడ వచ్చింది.

సందీపు మౌనంగ వుండిపోయాడు రమేశ్‌చంద్ర పరేశాన్ పాలయ్యాడు. గుర్రపు పందేల ఆట గుర్తొచ్చింది చంద్రకు.

సుశీల నొరు విప్పలేదు. మెమో రాగానే చూస్తే నాలుగేళ్లపేరుమీద నాలుగు పేపర్లు బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోయినయి.

చంద్ర జుట్టుపీక్కున్నాడు. అమ్మిన ప్లాట్లు గుర్తొచ్చాయి. తరిగిన బ్యాంక్ అకౌంట్లు గుర్తొచ్చాయి. భార్య మీది బంగారం అమ్మిందీ గుర్తొచ్చింది.

“పంతుల్ల పిల్లలు, కూలీల పిల్లలు ఒకేసారి పాస్ అవుతుంటే మూడు పూటలు రాజ బోజనాలు తిని, విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకుని ఏటా ఓ పేపరు వొదిలేస్తూ వస్తుంటే చివరికి నాలుగు పేపర్లు, మిగిలిపోయినయి. మరి ఇక ఎంచేస్తడో చేయమను. చెప్పి చెప్పి విసొచ్చింది. నా కడుపున మొద్దు పుట్టాడు.” అంటూ చించుకున్నాడు.

సుశీల మౌనంగా వింటు నిలుచుంది. లక్షలు, లక్షలు ఖర్చుపెట్టినా కొడుకు లెక్కకు రాడాయే అని కుమిలిపోతూనేవుంది.

"నేను హరికథ చెపుతున్నానా. వింటూ నిలుచున్నావు. పిలువు వాన్ని పిల్చి అడుగు" అన్నాడు కోపంగా.

"నేను ఇప్పుడు అడిగేదేముంది. మొదలె చెప్పాను ఇక్కడవున్నంత వరకు చదువుతడని మీరే వానికి అలుసిచ్చి డబ్బంత పాడుచేస్తిరి అత్తమామ పెట్టిన బంగారాన్ని అమ్మిస్తిరి." అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంటుంది.

"దరిద్రం మొఖం నీ వాలెనే నీ కొడుకు" అంటూ అసహ్యంగా చీదరించుకున్నాడు.

"ఆమెనెందుకు అంటరు అసలు నేను బియస్సి చదువుత అన్న వినక నాకిష్టంలేని కోర్సులో చేర్చారు. నా కష్టం నేను చేస్తాను. పాస్‌కాలేదు నేనేంచేయను" అన్నాడు తలుపు దగ్గర నిలుచోని.

"వరేయ్ కష్టంచేస్తే ఎందుకు పాస్‌కారు మిగతవాళ్లు కాలేదా?" అంటూ కొడుకు వైపు చూస్తు పళ్లు కొరుకుతూ అడిగాడు.

"సగం మంది ఫేయిలే. ఏదో కొంతమందే పాస్ అయ్యారు ఇష్టం లేని చదువు చదివిస్తే అంతే మరి" నేలనుచూస్తూ అన్నాడు.

"అసలు ఏతండ్రైనా నీవు ఏం చదవదలచుకున్నావురా అని అడిగి చదివిస్తుండ్రాని. ఎవరినో చూసి నాకొడుకు గూడ అట్లా కావాలని చదువులను చాసిస్తే, చదువొస్తదా కంప్యూటర్ కంప్యూటర్ అని ప్రాణంతీస్తూంటే ఏం చేసేది ఇంకా నయం పిచ్చి లేవలేదు" ఓ రకంగా తండ్రి వైపే చూస్తూ అన్నాడు.

"అరే నీవు మాట్లాడకుర. నాకు బీపి పెరుగుతుంది. చదవనప్పుడు నా ఇంట్లో ఉండొద్దు ఎటన్నవెళ్లిపో" అన్నాడు విసుగ్గా.

"ఓ పోత. ఈ పోరు నేను భరించలేను. ఎటన్నపోయి అమాలిపని చేసుకుని బతుకుత కంప్యూటర్ కంప్యూటర్ అని మీరు కన్న కలలన్ని కరిగిపోయాయి. అమెరికాలో పనిచేస్తూ ఆస్తి సంపాదించాలని వెళ్ళిన వాళ్ళు ఒక్కొక్కరే తిరిగి వస్తున్నది చూస్తూనే వున్నాంగ. ఇకపోతె మన దగ్గర యం.సి.ఎ. చేసిన వాళ్ళంతా కోట్లల్లో బిల్స్ రాస్తున్నది చూస్తలేము. నా పని అంతే" అన్నాడు విసుగ్గా.

"సిగ్గులేదుర, తండ్రి వ్యాపారి కొడుకు అమాలి" అన్నాడు.

"ఏం వ్యాపారం నాన్నమీరు చేసేది. రియల్ ఏస్టేట్ ఓ వ్యాపారమా?" అన్నాడు వెటకారంగా సందీప్

"అరేయ్ నీకేమైనా బుద్ధుందా. తండ్రితో మాట్లాడేది అట్లానేనా? నోర్మూయ్" అంది కొడుకు వైపుచూస్తు తల్లి.

"అమ్మా నేను కానివెంట్‌లోలేను. ఏదన్నపడడానికి" అని కాస్త గట్టిగానే అన్నాడు.

"ఇప్పుడు ఆ స్తాయే కదా మిగిలింది" అని మాత్రం అన్నాడు కాని తాను ఒక్కసారె కదిలిపోయాడు.

సందీప్ మాట్లాడే ప్రయత్నం చేయబోగా "పో భుజాలు పట్టి అక్కడి నుండి నెట్టుతూ లోపలికి పో" అంది తల్లి.

పరీక్షలు ఏట రెండు సార్లు వస్తూ, పోతున్నాయి. కాని సందీప్ ఉన్నచోటే వుండిపోయాడు.

... ...

ఈ లోపు అమెరికా అర్థిక పరిస్థితి మారి, సాఫ్ట్‌వేర్ వేవ్‌ను కన్‌ఫ్యూజ్ చేసింది.

ఆ రంగంలో అనుకోని విధంగా వచ్చిన మార్పు వల్ల ఎంసెట్ కోసం కట్టించిన ప్రయివేటు కాలేజీలు బి.ఇడి కాలేజిలుగా మారుతున్నాయి.

బి ఎస్సీ పాస్ అయిన కూతురును "నీ ఇష్టం వొచ్చిన కోర్సు చదువుకో" అన్నాడు గత అనుభవం చెప్పిన పాఠం గుర్తుంచుకొని

అమ్మాయి బి.ఇడిలో చేరింది.

సందీప్ హైద్రాబాద్‌లో రాజు వాళ్ల దగ్గరవుంటు ఏదన్న వ్యాపారం చేయాలని ఆలోచిస్తున్నాడు.

చంద్ర చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పూర్తిగా పడిపోయినయి. పంటలు లేవు జనం చేతిలో డబ్బు లేదు. రోజు పత్రికలవాళ్లు అర్థికపరమైన వ్యాపారుల గుట్టురట్టు చేస్తూ వార్తలు రాస్తూ వుండడం వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో చాలమంది అరెస్టల పాలు అవుతున్నారు. కొడుకు సాఫ్ట్‌వేర్ చదువు సాగక అమెరికా పోవడం ఆగిపోగా, సంపాదించింది కరిగిపోయి చంద్ర వ్యాపారంలో మళ్లి మొదటికొచ్చిందు.

(ఆట వారి తెలుగు పలుకుల పత్రికలో ముద్రితమైనది)

ఫిబ్రవరి-2003